క్లుప్తంగా

పాక్షిక చంద్రగ్రహణం.. నేడు ఆలయాలు మూసివేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఆదివారం 6 గంటల తరువాత ఆలయంలో సంప్రోక్షణ చేసి ఆలయ ద్వారాములు తెరిచి భక్తులకు స్వామివారి దర్శన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయాన్ని శనివారం పాక్షిక చంద్రగ్రహణం ఉన్నందున మధ్యాహ్నం మహానివేదన తర్వాత మూసివేయనున్నట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఆలయం తెరుస్తామని పేర్కొన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి



మఠంపల్లిలో ప్రచార వాహనం అనుమతి పత్రాలను తనిఖీ చేస్తున్న ఎంసీసీ బృందం

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు వినియోగించే ప్రచార వాహనాలకు ఆర్డీఓ అనుమతి తప్పనిసరిగా ఉండాలని, లేనట్లయితే నిలువరించడం జరుగుతుందని మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలు బృందం ఇన్‌చార్జ్, ఎంపీడీఓ ఎం.జానకిరాములు అన్నారు. శుక్రవారం మఠంపల్లిలో ఎన్నికల ప్రచార వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. అదేవిధంగా మఠంపల్లి, బక్కమంతులగూడెం, భీమ్లాతండా, పెదవీడు తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంసీసీ బృందం ఏఎస్‌ఐ సైదులు, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, నారమ్మ, లక్ష్మణ్‌నాయక్, మౌనిక తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీని గురువారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ శంభయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమవరపు వెంకటాచారి, కోశాధికారిగా ఉప్పల లక్ష్మీనర్సయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటాచారి, పిచ్చయ్య, నర్సింహాచారి, విశ్వరూపాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎన్నికల ప్రచారం



మఠంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మఠంపల్లి : ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ పిల్లుట్ల రఘు అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడే నాయకుడని భారీ మెజార్టీతో ఆయనను గెలిపించాని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వల్లపుదాసు రామాంజీగౌడ్, సుధాకర్, సాయిబాబా, చిన్ని, రవినాయక్, బాబు, మోతీలాల్, తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కేఎల్ఎన్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న గీత కార్మికులు, నాయకులు

హుజూర్‌నగర్ : గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. హుజూర్‌నగర్‌లో గీత కార్మికులకు ఇటీవల 55 కొత్త లైసెన్సులు మంజూరు చేయించిన సందర్భంగా శుక్రవారం పట్టణ గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు వల్ల పుదాస్ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ యరగాని నాగన్న, పెద్ద గౌడ్‌లు ఉపేందర్, రామ్మూర్తి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పరశురాములు, పాండు, సాయన్న, శ్రీను, గీత కార్మికులు పాల్గొన్నారు.

ప్రయాణం సాగించేదెలా..

అనంతగిరి : మండల కేంద్రం నుంచి బొజ్జగూడెం, కోదాడకు వెళ్లే దారిలో హరితహారం చెట్లతో పాటు కంపచెట్లు విరివిగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని కోరుతున్నారు.



బొజ్జగూడెంతండా రహదారిని కమ్మేసిన చెట్లు

ప్రమాదకరంగా గుంత

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు గ్రామం నుంచి బరాఖత్‌గూడెం వెళ్లే రోడ్డులో కేబుల్ వైర్ ఏర్పాటు కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా ఉంది. గుంత తవ్వి నెల రోజులకు పైగా అవుతున్నా సంబంధిత అధికారులు నేటివరకు పూడ్చలేదు. మూలమలుపులో గుంత ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే గుంత పూడ్చాలని కోరుతున్నారు.



బేతవోలు -బరాఖత్‌గూడెం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంత

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేళ్లచెరువులోని ముస్లిం బజార్, చెర్వుకట్ట బజార్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లింలలో చాలామంది పేదలు ఉన్నారని, వారి అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రషీద్, లాలూ, జానీ, మదర్సా, బషీర్, బాబు, రఫీ, ఫిరోజ్ ఖాన్, రియాజ్, యూసుఫ్ బీ, ఫర్జానా, సుబానీ, రియనా, జెరీనా తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ఉస్మానియా మసీదులో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఎండీ షఫీ, బాలవెంకటరెడ్డి, చిన్నపంగు అశోక్, లక్ష్మారెడ్డి, ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని కుతుబ్షాపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సైదిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా గడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పాదిల భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పూసల నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా అతన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సహకార సంఘం చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల స్రవంతి శోభన్‌బాబు, నాయకులు శ్రీహరి, గుర్వయ్య, మహేష్ ఉన్నారు.

సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి

గరిడేపల్లి : కేసీఆర్ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న, ఉప సర్పంచ్ సైదాబీ, పెండెం వీరయ్య, కృష్ణ, సైదులు, మాశెట్టి శ్రీహరి, లల్లీ తదితరులు పాల్గొన్నారు.

29న మలిదశ ఉద్యమకారుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న మలిదశ ఉద్యమకారుడు దొడ్డ నర్సింహారావు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో 29వ తేదీన నిర్వహించే మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారులు దొడ్డ నర్సింహారావు, చిలకరాజు అజయ్, నగేష్ రాథోడ్ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మలిదశ ఉద్యమకారుల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు మెండె లక్ష్మీనర్సు, పానుగంటి వెంకన్న, శీలం వీరయ్య, దుండిగళ్ల నారాయణ, జూలకంటి రామ నరసమ్మ, సత్యనారాయణరెడ్డి, జానీ బాష, లతీఫ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారులు కోరారు. శుక్రవారం చింతలపాలెంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఐక్యవేదిక సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. మలిదశ ఉద్యమకారులు వేములూరి రంగాచారి, నగేష్ రాథోడ్, దొడ్డ నర్సింహారావు, చిలక రాజు అజయ్, ఉసిరికాయల వెంకటేశ్వర్లు, గులాం హుస్సేన్, శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్, మతిన్, సోమయ్య పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలి

- రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు విలేకరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ రమేష్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఎన్నికలు – మీడియా పాత్రపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ కమలాకర్, అధికారులు కృష్ణ, అశోక్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ్‌పై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న కొణతం చిన వెంకట్‌రెడ్డి

నేరేడుచర్ల : నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సోమారం గ్రామంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఉత్తమ్ ఢిల్లీలో ఎలక్షన్ కమిషన్‌ను కలిసి రైతు బంధు, దళితు బంధుతో పాటు ఇతర పథకాల నిధులను నవంబర్ 2 లోపు విడుదల చేయాలని కోరితే ఆ మాటలను వక్రీకరించారని తెలిపారు. హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సైదిరెడ్డి ఓడిపోతాడనే భయంతోనే ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, నాయకులు ప్రవీణ్, సత్తార్, శ్రీను, జయకర్, సంజీవరెడ్డి, విజయ్, వెంకటేశ్వర్లు, భుజంగరావు, జమ్మయ్య, సామేలు, పకీర్, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉత్తమ్‌పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

గరిడేపల్లి : ఉత్తమ్‌కుమారెడ్డిపై బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సైదిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తమ్ 50వేల మెజార్టీతో గెలవటం ఖాయమన్నారు. కార్యక్రమంలో సీతారాంరెడ్డి, గుండు రామంజీగౌడ్, పైడిమర్రి రంగనాథ్, కటకం రమేష్, కృష్ణప్రసాద్, నాగరాజు, చాందిమియా, కందుల కోటిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, పరమేష్ పాల్గొన్నారు.

ఓడిపోతామన్న భయంతోనే ఎంపీ ఉత్తమ్‌పై తప్పుడు వ్యాఖ్యలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జుల నరేందర్ రెడ్డి, సురేందర్, వెంకటరెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

నేరేడుచర్ల : ఓ ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన పెద్ది అప్పిరెడ్డి దంపతులు తమ ఇంటికి తాళం వేసి ఈనెల 23న వారి కుమార్తె ఇంటికి పండుగకు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి రాగా తలుపులు పగలకొట్టి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి పర్సులో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌తో పాటు రూ.20వేల నగదును చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గెలిస్తే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



మునగాల : ఎస్ఎన్‌పేటలో పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పద్మావతి

మునగాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ప్రతినెల రూ.2500 నగదుతో పాటు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసే సదుపాయం అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మండలంలోని వెంకట్రాంపురం గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన ఎస్ఎన్‌పేటలో శుక్రవారం ఆమె కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై నిర్వహించిన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడువాయి తండాకు చెందిన 30 కుటుంబాలు, వెంకట్రాంపురం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు, ఎస్ఎన్‌పేటకు చెందిన 15 కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో భుక్యా సంతోష్, భూక్యా పంతులు, భూక్యా భిక్షం, భూక్యా జగన్, అఖిల్, భానోతు సక్రు, భూక్యా వెంకన్న, అలిబీ, భూక్యా జగన్, బెల్లంపల్లి రామారావు, మందపల్లి శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటేశ్వరరావు, కాసర్ల బోస్, జానకిరెడ్డి, మట్టయ్య యాదవ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బసవయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ



నేరేడుచర్ల : రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : రైతుబంధు, దళిత బంధు పథకాల లబ్ధిదారులకు నగదు బదిలీని నిలిపివేయాలని ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ మండల, పట్టణ పార్టీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్చర్ల- కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమగాని మురళి, నాయకులు లింగయ్యయాదవ్, చిత్తలూరి సైదులు, అనంత్ శ్రీను, వల్లంశట్ల రమేష్‌బాబు, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ, బాష, జగతయ్య, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకుల రాస్తారోకో

మఠంపల్లి : రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అదేవిధంగా యాతవాకిళ్లలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్‌లో ఈనెల 31న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య కోరారు. శుక్రవారం మఠంపల్లిలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మన్నెం శ్రీనివాసరెడ్డి, కోలాహలం లక్ష్మీనరసింహరాజు, కృష్ణంరాజు, నాగిరెడ్డి, హఫీజ్‌ఖాన్, భరత్‌నాయక్, పుల్లారెడ్డి, బీవీరామారావు, రామచంద్రయ్య, నవీన్‌నాయక్, సీతారామయ్య, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు, దళితుల వ్యతిరేకి ఎంపీ ఉత్తమ్

గరిడేపల్లి : రైతుబంధు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడాన్ని ఖండిస్తూ గరిడేపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అదేవిధంగా కల్మలచెరువులో ఉత్తమ్‌కుమారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉత్తమ్‌కుమారెడ్డి రైతు, దళితుల వ్యతిరేకి అని విమర్శించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు గుత్తికొండ వెంకటరమణారెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కుక్కడపు గుర్వయ్య, మాశెట్టి శ్రీహరి, వెన్న రవీందర్‌రెడ్డి, సుధీర్, కృష్ణ, సీతారాంరెడ్డి, మచ్చ రమేష్, బాబునాయక్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



గరిడేపల్లిలో..



మఠంపల్లిలో..

జయమ్మకు నాయకుల నివాళి



జయమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన సీపీఐ నాయకురాలు జయమ్మ గురువారం మృతి చెందారు. శుక్రవారం ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రాములు, పాలకూరి బాబు, ఉస్తెల నారాయణరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, ధనుంజయనాయుడు, దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, మామిడి వెంకయ్య, రామయ్య, వీరయ్య, హరిబాబు, అమర్, అజీజ్ పాషా, పాండు, పల్లె వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసన



కోదాడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోదాడఅర్బన్ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని ఖండిస్తూ కోదాడలోని పెద్ద మసీద్ ఎదుట శుక్రవారం ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మైనార్టీ నాయకుడు ఎస్‌కే నయీం మాట్లాడుతూ అమెరికా అండదండలతో గత 20 రోజులుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి చేయడం దుర్మార్గమని, ఇజ్రాయిల్ తక్షణమే దాడులను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ముస్లిం మత పెద్దలు మౌలానా, హతహర్, మహిమూద్ జానీ, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహారావు, రైతు కూలీ సంఘం నాయకుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్య, ఉపాధి యువత హక్కు



ఏఐవైఎఫ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : విద్య, వైద్యం, ఉపాధి యువతకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది వారికి భిక్ష కాదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు అన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర రెండవ మహాసభల పోస్టర్‌ను శుక్రవారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో ఆయన స్థానిక సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలలో యువత, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఉద్యమస్ఫూర్తితో మరింత ముందుకు పోతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జానీపాషా, మోతిన్ రాము, నసీర్, జానీ, సైదులు, నాగులు తదతరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణలో కల్యాణతంతు జరిపించారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ పతనం ఖాయం

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రకటించడంతో బీఆర్ఎస్ పతనం ఖాయమైందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మంగాపురం, రాయినిగూడెం, కీతవారిగూడెం, తాళ్లమల్కాపురం, రేగులగడ్డతండా, కొత్తగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూలగుండ్ల సీతారాంరెడ్డి, గుండు రామంజీగౌడ్, రంగనాథ్, కటకం రమేష్, బచ్చలకూరి కృష్ణప్రసాద్, సత్యనారాయణ, నాగరాజు, చాందిమియా, కోటిరెడ్డి, సందీప్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని మాధవరాయినిగూడెం సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు శుక్రవారం ఎస్ఐ జహంగీర్ తెలిపారు. కానీ అక్కడ ఎవరూ పేకాట ఆడటం లేదని, కానీ ఒక ప్రజా ప్రతినిధి, ఒక మహిళతో ఉన్నారని, వారి వ్యక్తిగత విషయం కాబట్టి వారిని మందలించి వదిలిపెట్టినట్లు ఆయన తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి సాగనంపాలి

నేరేడుచర్ల : దేశ సమగ్రతకు విఘాతం కలిగించే బీజేపీ, ఆ పార్టీతో చీకటి ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా మోసం చేస్తున్నాయని, ప్రజాతీర్పుతో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసి 12 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, రావుల సత్యం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాగర్ ఎడమకాలువకు నీటిని విడుదల చేయాలి

మునగాల : సాగర్ ఎడమకాలువ కింద ప్రస్తుత సీజన్‌లో సాగుచే సిన పైర్లకు సాగునీటిని విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక ఎండిపోతున్నాయని దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన సాగునీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

నడిగూడెం : కోదాడ పట్టణంలో ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు ఖలీల్ అహ్మద్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు లాల్ మహ్మద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, నాయకులు గౌస్, గౌస్‌మియా, బడేమియా, జానిమియా పాల్గొన్నారు.